క్లుప్తంగా

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

గచ్చిబౌలి: రఘునాథ్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. కొండాపూర్‌లోని ఎఫ్‌సీఏ గ్రౌండ్స్‌లో రఘునాథ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి రఘునాథ్ యాదవ్ పోటీలను ప్రారంభించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 50 టీమ్‌లు పోటీలో పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భాను ప్రకాష్, రెజ్లర్ గీత, మాజీ క్రికెటర్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాపూనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ బాపూనగర్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బాపూనగర్‌లో ఇప్పటికే చాలా వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశంగౌడ్, గోపీనగర్ బస్తీ కమిటీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్, నాయకులు మహేష్, లక్ష్మణ్‌యాదవ్, రాజ్‌కుమార్, ముంతాజ్ బేగం, సత్యం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మియాపూర్: చందానగర్‌లోని గంగారం బస్టాప్ వద్ద హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోప్ ఫౌండేషన్ సమాజ సేవ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, నరేందర్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

మార్షల్‌ఆర్ట్స్‌లో ముత్తంగి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పటాన్‌చెరు టౌన్: మార్షల్ ఆర్ట్స్‌లో ముత్తంగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం హైదరాబాద్ మేడ్చల్‌లో బ్రిలియంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ పోటీలో విద్యార్థులు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జయవర్ధన్, సాయిగణేశ్, రవితేజ, ప్రశాంత్, అజయ్, హన్సిక, జాఫర్, సోమశేఖర్, రామ్‌చరణ్‌లను సోమవారం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అధికారులు సమన్వయంతో పని చేయాలని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్ల విస్తరణ, డ్రైనేజీ పనులు, ఓపెన్ జిమ్‌లు, వైకుంఠ ధామాలు, మంజీర నీటి పైపులైన్ల పనులపై సోమవారం ఆయా విభాగాల అధికారులతో మేయర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు చిట్ల దివాకర్, ఆగంరాజు ముదిరాజ్, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపాలని వినతి

నిజాంపేట్: నిజాంపేట కార్పొరేషన్ పరిధి స్ప్రింగ్ విల్లా కాలనీలో ఏర్పాటు చేయనున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే మొబైల్ టవర్‌ను నివాసిత ప్రాంతాల మధ్య ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జిమ్‌తో పాటు చిన్నపాటి ఫంక్షన్‌లు చేసుకునే స్థలంలో టవర్ ఏర్పాటు చేస్తుండటంతో దాని ద్వారా వెలువడే రేడియేషన్ వల్ల అనారోగ్యం బారిన పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే టవర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించాలని కోరారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

గుప్పుమంటున్న గంజాయి

బానిసవుతున్న యువత, కూలీలు



రామచంద్రాపురం (పటాన్‌చెరు): గంజాయి గుప్పుమంటోంది.యువత, కూలీలు మత్తుకు బానిసలవుతున్నారు. పట్టణాలకు దగ్గరి గ్రామాల్లో జోరుగా నిర్మాణాలు సాగుతున్నాయి. పనులు చేసేందుకు వచ్చిన భవన నిర్మాణ కార్మికులు అలసట నుంచి దూరం కావడం కోసం మత్తుకు బానిసవుతున్నారు. వలసజీవుల బలహీనతను అక్రమార్కులు కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని సరఫరా చేస్తున్నారు. మత్తుకు బానిస చేస్తున్నారు.

జోరుగా దందా...

వలస కార్మికులు ఎక్కువగా నివసించే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాంతంలో మత్తుదందా జోరుగా సాగుతోంది. కార్మికులు, యువకులు చాలామంది గంజాయి పొడిని సిగరెట్లు, బీడీల్లో నింపి పీల్చుతున్నారు. మత్తులో జోగుతున్నారు. ఏడాది కాలంలో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు గంజాయి కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఫిబ్రవరిలో 5 కిలోలు, ఆగస్టులో 13 గ్రాముల కొకైన్ , మార్చిలో 22 కిలోల గంజాయి, తాజాగా కొల్లూర్‌లో 120 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



పట్టుకున్న గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీసీపీ శిల్పవల్లి

సమాచారం ఇవ్వండి..



మాదకద్రవ్యాలు వాడి జీవితాలు నాశనం చేసుకోవద్దు. గంజాయి అమ్మేవారి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వండి. యువత మత్తుకు బానిస కావొద్దు.

– శిల్పవల్లి, డీసీపీ, మాదాపూర్

నిఘా ఏర్పాటు చేశాం



గంజాయి రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీలు చేస్తున్నాం. అనుమానం ఉన్నచోట్ల నిఘా ఏర్పాటు చేశాం.

– సంజయ్, ఇన్‌స్పెక్టర్, రామచంద్రాపురం

ఈర్ల చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి



నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ శ్రీలత, ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు అభివృద్ధి, సుందరీకరణ, నాలా విస్తరణ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, డిప్యూటి మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 సంవత్సరంలో ఈర్ల చెరువును దత్తత తీసుకున్న విషయం తెలిసిందన్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి పురోగతి సాధించాలన్నారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ శ్రీకాంతి, డీఈ స్రవంతి, ఏఈ ప్రతాప్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

జిన్నారం(పటాన్‌చెరు): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించారు. గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో కామరతి బీరప్ప, గుమ్మడిదల గ్రామంలో మల్లికార్జునస్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన దేవాలయాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీన, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

హోంమంత్రికి ఆహ్వానం



పటాన్‌చెరు: రంజాన్ పర్వదినం పురస్కరించుకుని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 12న బుధవారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న నియోజకవర్గస్థాయి ప్రభుత్వ ఇఫ్తార్ విందుకు హాజరుకావాలని కోరుతూ మంత్రి మహమ్మద్ అలీకి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం ఆహ్వానపత్రికను అందజేశారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

వెస్ట్ జోనల్ కమిషనర్‌తో ట్రాఫిక్‌పై చర్చించిన అధికారులు



జోనల్ కమిషనర్ శంకరయ్యతో సమావేశమైన ట్రాఫిక్ పోలీసులు, ఎస్ఆర్‌డీపీ అధికారులు

గచ్చిబౌలి: ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ఎదురయ్యే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు రోడ్డు విస్తరణ చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులు శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శంకరయ్య దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఫ్లై ఓవర్ నిర్మాణం, ట్రాఫిక్ సమస్యపై సుదీర్ఘంగా చర్చించారు. గచ్చిబౌలి జంక్షన్‌లో ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి కొండాపూర్ వైపు మరో ఫ్లైఓవర్ నిర్మాణం పనులు జరుగుతున్న క్రమంలో గచ్చిబౌలి జంక్షన్ మీదుగా వెళ్లే ఫ్లై ఓవర్ రాడిసన్ హోటల్ వద్ద ల్యాండ్ అయ్యే అవకాశం ఉంది. పిల్లర్ల నిర్మాణం చేపడితే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ఎస్ఆర్‌డీపీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గచ్చిబౌలి జంక్షన్ నుంచి రాడిసన్ హోటల్ వరకు రెండు వైపులా వాహనాల రాకపోకలను నిలిపివేయాలని భావిస్తున్నట్లు జోనల్ కమిషనర్‌కు తెలిపారు. అందుకు ప్రత్యామ్నాయంగా అంజయ్యనగర్ నుంచి క్యూమార్ట్ వరకు రోడ్డు విస్తరించాలని సూచించారు. గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు వెళ్లే రోడ్డును మూసి వేస్తే ట్రిపుల్ ఐటీ నుంచి రాడిసన్ హోటల్, రాంకీ రోడ్డును పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా మరమ్మత్తులు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు. సంబంధిత విభాగాల అధికారులతో కలిసి ఫీల్డ్ విజిట్ చేసిన అనంతరం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడతామని జోనల్ కమిషనర్ శంకరయ్య వెల్లడించారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ హన్మంత రావు, గచ్చిబౌలి ట్రాఫిక్ సీఐ నవీన్, ఎస్ఆర్‌డీపీ అధికారులు ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన బసిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి తన తండ్రి బసిరెడ్డి ప్రతాపరెడ్డి జ్ఞాపకార్థం గ్రామ అవసరాలకు సొంత నిధులతో ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా ట్రాక్టర్‌ను గ్రామ పంచాయతీకి అందజేశారు. అనంతరం శ్యాంసుందర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కావ్యకాశిరెడ్డి, ఎంపీటీసీ నీనా చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కోసం...ఓ పేజ్

సాక్షి, సిటీబ్యూరో: తల్లిదండ్రులు పేరెంటింగ్‌కు సంబంధించి తమ సమస్యలను పరస్పరం పంచుకునేందుకు తాము ప్రారంభించిన పేరెంట్ ట్రైబ్‌లో 78వేల మందికి పైగా తల్లులు/తండ్రులు నమోదు చేసుకున్నారనీ ,దేశంలోనే పేరెంట్స్ (తల్లిదండ్రులు) కోసం పేరెంట్స్ చేత ప్రారంభించిన అతిపెద్ద ఆన్‌లైన్ వేదికగా అవతరించిందనీ ప్రముఖ మామ్ అండ్ బేబీ కేర్ బ్రాండ్, సూపర్‌బాటమ్స్ ప్రతినిధులు తెలిపారు. నగరానికి చెందిన తల్లులు/తండ్రులు ఇతరులతో తమ పేరెంటింగ్ అనుభవాలను పంచుకోవడం, నిపుణుల సలహాలను కోరడం, పలు అంశాల పట్ల మార్గనిర్దేశనం ఆశిస్తుంటే తమ ఫేస్ బుక్ పేజీని సందర్శించాలన్నారు.

నీలం మధుకు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అనంతారం, గుమ్మడిదల గ్రామాల్లో సోమవారం నిర్వహించిన మల్లికార్జునస్వామి ఉత్సవాలకు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఇద్దరి రిమాండ్

పటాన్‌చెరు టౌన్: బాలిక ఆత్మహత్య కేసులో ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన సంఘటన పటాన్చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు పట్టణం అంబేడ్కర్ కాలనీకి చెందిన బాలిక శనివారం ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఏపీలోని అనంతపురం జిల్లా కొమ్మూరు గ్రామానికి చెందిన ఆదిశేషు, హరీష్ కుమార్‌లను అదుపులోకి తీసుకొని సోమవారం రాత్రి రిమాండ్ తరలించారు.

బీఆర్ఎస్‌కు బలం, బలగం కార్యకర్తలే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్ఎస్‌కు బలం, బలగం కార్యకర్తలేనని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం బీరంగూడలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మున్సిపల్, మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.60లక్షల మంది సభ్యత్వంతో బీఆర్ఎస్ రాష్ట్రంలోనే అజేయశక్తిగా నిలిచిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అమీన్‌పూర్ బీరంగూడ నుంచి కిష్టారెడ్డిపేట వరకు 100 ఫీట్ల రహదారిని నిర్మించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నాలుగు భారీ రిజర్వాయర్లను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఈర్ల రాజు, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా సమస్యలే..

బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్



కాలనీవాసులతో రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్ చేపట్టిన గడపగడపకు పాదయాత్ర సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తారక్‌రామ్‌నగర్, గణేష్ నగర్, మహాత్మా గాంధీ, రాజీవ్‌గాంధీ నగర్, సుభాష్ చంద్రబోస్‌నగర్, అంబేద్కర్‌నగర్‌లలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ కాలం గడుపుతున్నారని, ఇకనైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుమార్ యాదవ్, కమలాకర్‌రెడ్డి, అనిత, నర్సింగ్ రావు యాదవ్, నరసింహాచారి, స్రవంతి, కవిత పాల్గొన్నారు.

సరుకులు అందజేత

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్‌అబిద్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి అభినందించారు. పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి రామరాజునగర్‌లో అబ్దుల్ అబిద్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం వికలాంగులు, ముత్తంగి గ్రామ పంచాయతీ వర్కర్లు, నిరుపేదలకు సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గూడెం మధుసూదన్‌రెడ్డి అబ్దుల్‌ను అభినందించారు. కార్యక్రమంలో ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, అబ్దుల్ ఖాదర్, మేరాజ్‌ఖాన్, నిజాంఖాన్, సోయల్‌ఖాన్, అబ్దుల్ సలీం, రామకృష్ణ పాల్గొన్నారు.

హైదర్‌నగర్ అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు కోనేరు రాగప్రసాద్, రవికుమార్, సూర్యనారాయణ, రాజేష్, సురేష్, గణేష్, కృష్ణ ప్రసాద్ నాగేందర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



బృందావన్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 36 మందికి సంగారెడ్డి జిల్లా జడ్జి జరిమానా విధించారు.ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం...శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 36 మంది దొరికినట్లు తెలిపారు. సోమవారం నిందితులను సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 31 మందికి ఒక్కొక్కరికి రూ.రెండువేల చొప్పున, ఐదుగురికి రూ.మూడువేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

ఇఫ్తార్ విందు

పటాన్‌చెరు టౌన్: రంజాన్‌ను పురస్కరించుకొని మండలంలోని ముత్తంగి గ్రామ పరిధిలోని రామరాజునగర్ కాలనీలో బీఆర్ఎస్ మండల మైనార్టీ అధ్యక్షుడు ఆబెద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందుకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సపానదేవ్, అఫ్జల్, మెరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఈదుల నాగులపల్లిలో శంషాబాద్ నరసింహులు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు బీజేపీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, బీఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

డ్యూటీకి వచ్చి...

పటాన్‌చెరు టౌన్: డ్యూటీకి వచ్చిన ఓ కార్మికుడు ఛాతీ నొప్పి అంటూ కుప్పకూలిన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ గౌడ్ కథనం ప్రకారం పుల్కల్ మండలం మదిమాణిక్యం గ్రామానికి చెందిన గాజుల సుధాకర్(53) పాశమైలారంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వచ్చిన సుధాకర్ ఛాతీనొప్పి వస్తుందని తోటి కార్మికులకు చెప్పగా, మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ సమీపంలోని ఓ వెంచర్‌లో వాడుకలో లేని ట్యాంక్‌లో ఓ వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం వచ్చింది. వారు వెళ్లి చూడగా, మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. వెంచర్ సూపర్‌వైజర్ శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ

పటాన్‌చెరు టౌన్: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన భానూర్-బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం నందిగామకు చెందిన రజినీకాంత్ ఈ నెల 7వ తేదీన తన బైక్ పై బీడీఎల్ టౌన్ షిప్‌నకు కూరగాయలు తీసుకురావడానికి వెళ్లగా, శంకర్‌పల్లి నుంచి భానూర్ వైపు బైక్ పై వినయ్ వస్తున్నాడు. భానూర్ సమీపంలోకి రాగానే రెండు బైక్ లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రజినీకాంత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు రజినీకాంత్ కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. రామచంద్రాపురం పోలీసులు కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రంజాన్ ఆలీ జీవనోపాధి నిమిత్తం కొల్లూరుకు వలసవచ్చాడు. తన సోదరుడితో స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా ఈనెల7వ తేదీన ఉదయం 8గంటలకు కూరగాయల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని కోసం చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన సోదరుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ కోసం వచ్చి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఏపీలోని ఒంగోలు చెందిన ఓ బాలిక తను ప్రేమించిన వ్యక్తి కోసం రామచంద్రాపురం వచ్చింది. కాగా ప్రేమించిన ఆ యువకుడు ఆమెను సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లిలో వదిలేసి వెళ్లాడు. దీంతో ఆ బాలిక రోడ్డు పై రోదిస్తూ ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆమెకు ధైర్యం చెప్పారు. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన యువకుడు ప్రస్తుతం పటాన్‌చెరులో సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడని అతని కోసం ఇక్కడికి వచ్చానని వివరించింది. అతడి ఫోన్ నంబరు కూడా తన వద్ద లేదని సీఐ సంజయ్‌కు చెప్పగా, స్టేట్ హోంకు తరలించారు.

ఉద్యోగం పోయిందని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఉద్యోగం పోయిందని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం..సాయి విల్లాస్‌లో నివాసం ఉండే హరీశ్(30) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి.

అయితే ఇటీవలే హరీశ్ ఉద్యోగం పోయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం భార్య నందిని బయటకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న హరీశ్ చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఇంటికి రాగా ఉరివేసుకొన్న భర్త కనిపించాడు. స్థానికుల సాయంతో భర్తను మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడు హరీశ్ సోదరుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాత్‌రూమ్‌లో జారిపడి వృద్ధుడు మృతి

పటాన్‌చెరు టౌన్: బాత్‌రూమ్‌లో జారిపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం... శ్రీవాణినగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ జీవామృతరావు(67) ఆదివారం రాత్రి బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాలేదు. అయితే కుటుంబ సభ్యులు బాత్‌రూమ్ తలుపులు బద్దలగొట్టి లోనికి వెళ్లి చూడగా పడి ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు మదీనగూడలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి కుమారుడు ప్రేమ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.